డిటెక్టివ్ కథ

# నేరస్థులు తప్పించుకోలేరు

రచన :: భరణి

"చెప్పండి" అన్నాడు డిటెక్టివ్ చైతన్యం పైప్ వెలిగించి. డాక్టర్ మల్లిక్ ఓమారు ఇన్‌స్పెక్టర్ తిలక్ వైపు చూసి యిలా చెప్పాడు:

నేను అప్పుడే ప్రక్కగదిలో వాష్ బేసిన్‌లో చేతులుకడుక్కుని తువ్వాలుతో తుడుచుకుంటూ లేబరేటరీలోకి అడుగుపెట్టాను. అదేసమయంలో ఒక ముసుగుమనిషి తలుపుతోసుకుని లోనికి వచ్చాడు.

అతని చేతిలో నల్లటి రివాల్వర్ వుంది. అదృష్టవశాత్తు నన్నతను చూడలేదు. చటుక్కున స్క్రీన్ వెనక్కు వెళ్ళి దాక్కున్నాను అతను నా టేబులును సమీపించి వెళ్ళాడు. డ్రాయరు లాగాడు. తాళం వేసి వుండటం మూలాన వెంటనే రాలేదు తన జేబులోంచి తాళాలగుత్తి తీశాడు. ఒక తాళంతో డ్రాయరు తెరచుకుంది! భయంతో, ఆశ్చర్యంతో కంపించిపోయాను. అందులో నేను ఇటీవల కొత్తగా కనుక్కున్న ఒక రసాయనిక వస్తువును తయారుచేసే 'ఫార్ములా' ఉంది. దానిని దొంగిలించటానికి వచ్చేడేమోనని అనుమానం తట్టింది. వెంటనే అక్కడే స్టూలుమీద వున్న టెలిఫోను అందుకుని, పోలీస్‌స్టేషన్‌కు డయల్ చేశాను. ఏదైనా మాట్లాడితే అతనికి వినిపిస్తుందేమోనని, రిసీవరును 'హుక్'కు తగిలించకుండా కిందపెట్టాను. దానిని బట్టి ఎవరు ఫోనుచేసిందీ మీరు కనుక్కుంటారని ఊహించి అలాచేశాను."

"అతన్ని 'ఫార్ములా' కాగితంతప్ప మరేదీ తీసుకెళ్ళలేదుకదూ?" అనడిగాడు చైతన్య.

"లేదు."

"అటువంటి విలువైన కాగితాలు అందరికీ తెలిసేలా టేబులు సొరుగులో దాచుకుంటారా ఎవరైనా?"

"నిజమేననుకోండి. అయినా అది డూప్లికేట్ మాత్రమే ఒరిజినల్‌ను నిన్ననే భారత్ కెమికల్ యిండస్ట్రీస్ వాళ్ళకు ఇరవైవేలకు అమ్మేశాను."

"దానివల్ల లాభం పొందేవాళ్ళు, మీకు అనుమానంవున్న వాళ్లు ఎవరైనా ఉన్నారా?"

"న్యూ యిండియా కెమికల్స్ కంపెనీవాళ్ళు నన్ను దానిని అమ్మమని అడిగారు. కాని నేను నిరాకరించాను"

"కారణం డబ్బు తక్కువ యివ్వటమా?"

"కాదు వాళ్లు ముప్ఫయ్‌వేలు ఇస్తామన్నారు కాని భారత్ కెమికల్స్ కంపెనీ వాళ్ళకు ముందుగానే మాట యిచ్చాను. నేను పరిశోధన జరిపిన రోజులలో వాళ్లునాకు చాల ధనసహాయం చేశారు. అందుకని వాళ్లకే అమ్మవలసి వచ్చింది."

"మీ లేబొరేటరీ గది చాలచిన్నది. అందువల్ల మీరు ఆ వ్యక్తిని స్పష్టంగా చూసి వుండాలి. అతనెలావుంటాడో వర్ణించగలరా?" అడిగాడు చైతన్య.

"పొట్టిగా వుంటాడు— కొద్దిగా లావుకూడాను— జుత్తు కొంచెంతెల్లగా, కొంచెం నల్లగాను ఉంటుంది. వయస్సు చెప్పలేను. నల్లటి ఓవర్‌కోట్ తొడుక్కున్నాడు"

చైతన్య డాక్టర్ వంక తీక్షణంగా చూశాడు.

"డియర్ డాక్టర్! ఇక ఆపండి మీ కట్టుకథ" అన్నాడు. డాక్టర్ మొహం వెలవెలబోయింది.

"ఏమిటి చైతన్యగారూ! నేను కట్టుకథ చెబుతున్నాననుకొంటున్నారా?" అన్నాడు ఆవేశంతో.

చైతన్య నోట్లోని పైప్ చేతపట్టుకుని—

"డాక్టర్‌గారూ! మీ లేబొరేటరీ గది చాల చిన్నది.

స్క్రీన్ వెనుకనుంచి టెలిఫోన్ డయల్ చేస్తే. ఇవతలి వ్యక్తికి డయల్‌చేసిన చప్పుడు వినిపించకపోవడం అసంభవం స్క్రీన్‌కింద కొంత భాగం ఖాళీగా వుంది. అందువల్ల మీరు స్క్రీన్ వెనుక నిలుచున్నప్పుడు మీ కాళ్లు స్పష్టంగా అవతలివ్యక్తికి అగుపిస్తాయి. అందుకనే ఇదంతా కల్పితగాథ అంటున్నాను డాక్టర్! ఈ నెపంతో మీరు 'ఫార్ములా'ను రహస్యంగా రెండోసారి అమ్మి డబ్బుచేసుకోవాలనుకున్నారు. కాని మీ కోరిక నెరవేరలేదు"

అని ముగించి చైతన్య ఇన్స్‌పెక్టర్ తిలక్‌వైపు చూశాడు

తిలక్ బేడీలు పట్టుకుని డాక్టర్‌ను సమీపించాడు.